సాలెగూడు

శ్రీ ఎంగరాజు లింగమూర్తి

చంద్రం నడుస్తున్నాడు.

అతను నడుస్తుంటే భూమి కదులుతున్నట్లనిపించింది. ఇరు ప్రక్కలా వున్న భవనాలు నడుస్తున్నట్టు, ఆకాశం నిటారుగా నిలబడినట్టూ తోచింది. అవిశ్రాంతంగా పరుగెత్తే కాలచక్రంలా వుందనుకున్నాడు సిమెంటురోడ్డు. వచ్చేపోయే కార్లను, రిక్షాలను, సైకిళ్లను దారులిచ్చే ట్రాఫిక్ పోలీసు అనంతకోటి సంతానాన్ని లోకం మీదికి వదులుతున్న సృష్టికర్తలా వున్నాడనుకున్నాడు.

ఏవో కేకలు వినిపించి ప్రక్కకు తిరిగి చూశాడు చంద్రం.

పేవుమెంటుమీద బస్సుకోసం వేచివున్న గుమాస్తా ఛాయీని కాబూలీవాలా వడ్డీ డబ్బుకోసం హంగామా చేస్తూ, అతని పరపతిని నడిరోడ్డుమీద దోపిడీ చేస్తున్నాడు.

జీతంవచ్చిన నాల్గోనాడే జేబు ఖాళీఅయి అప్పిచ్చే దాతకోసం వెతుకుతున్న మరో గుమాస్తాముందు 'ధర్మం చేయండి బాబూ' అని వెంటబెట్టుకుంటున్నాడు కుంటటం అలవాటు చేసుకున్న బిచ్చగాడు.

పుష్టిగా హోటల్లో మెక్కింది అరక్క బొజ్జనిమురుకుంటున్న ఆసామీముందు ఒక బిచ్చగత్తె చేయిజాపితే, తమలం సేవిస్తున్న ఆ బొజ్జమనిషి, మీసంగా విల్సన్ సిగరెట్ పొగవదులుతూ ఆ యౌవనపు బిగువును కళ్ళతో కొల్లగొడుతున్నాడు—ప్రక్కనే జేబు కొస్తున్న కత్తెర దొంగను గమనించకుండా.

కాస్త ఎడంగా బస్సుకోసం నిలుచున్న కాలేజీ పడుచు మీద బాణాల్లా దూసుకువచ్చి పడుతున్నాయి దారిన పోయే దానయ్యల చూపులు.

తన పరువును నడిరోడ్డుమీద దోపిడీ చేస్తున్నందుకు అభిమానంతో కుంచించుకు పోతున్న గుమాస్తా ఛాయీ, అప్పిచ్చే దాతకోసం అన్వేషిస్తూ నిలబడిన మరో గుమాస్తా, బస్సుకోసం ఎదురుచూస్తున్న కాలేజీ పడుచూ ఒకకోవకు చెందినవారుగా అనిపించింది చంద్రానికి.

వడ్డీడబ్బుకోసం నోరు పారేసుకుంటున్న కాబూలీవాడు, కుంటటం అలవాటు చేసుకున్న సోమరి బిచ్చగాడు, నీతికి ఇనుప తెరలు దించిన ఘరానా బొజ్జమనిషీ, యౌవనపు బిగువును కావాలని ప్రదర్శిస్తూ యాచిస్తున్న బిచ్చకత్తె, బొజ్జవాణ్ణి పొంచివున్న కత్తెరదొంగ, దారినపోయే దానయ్యలు ఒకేకోవకు చెందినవారుగా చంద్రానికి పొడగట్టారు.

'ఏమిటీ సమాజం ?' అని ప్రశ్నించుకున్నాడు.

ఉన్నవాడు మధ్యతరగతి వాడిని పీడిస్తున్నాడు. లేనివాడు ఉన్నవాడి ననుకుంటున్న మధ్యతరగతివాణ్ణి బాధిస్తున్నాడు. స్వ స్త్రీలను విజ్ఞానమణులను చేయలేని దానయ్యలు పరాయిదాన్ని నడిబజారులో చూపులతో దాహం తీర్చుకుంటున్నారు.

ధర్మం మూడుకాళ్ళ ముసలమ్మలా వుందనుకున్నాడు చంద్రం.

చంద్రం నడుస్తున్నాడు.

రిక్షాలు, కార్లు, సైకిళ్లు అతణ్ణి దూసుకుపోతున్నాయి. అతని బుర్రలో ఆలోచనలు పరుగులుతీస్తున్నాయి.

ఉత్తరం డబ్బాలో వేసిరమ్మంటే "తలనొప్పిగా వుంది-టీ ఇప్పించండి సార్" అంటాడు బంట్రోతు. ఆరునెలల ఇంక్రిమెంట్లు రావాలి చూడమంటే, స్వజాతీయుడైన అకౌంట్సు సెక్షన్ గుమాస్తా నేరుగా లంచం అడగలేక, "రేపు రాత్రో డిన్నరిస్తావా!" అంటాడు. ప్రమోషన్కోసం అధికారిని వేడుకుంటే "సరే-చూద్దాం...రేపటినుంచి తీరుబడి చేసుకొని ఓ గంటసేపు మావాడికి ప్రైవేటు చెబుతావుకదూ!" అని ఆదేశిస్తాడు.

టీ ఇప్పించమని ప్రాధేయపడిన బంట్రోతు, డిన్నర్కోసం హెచ్చరించిన అకౌంట్సు గుమాస్తా, ప్రైవేటు చెప్పమని ఆదేశించిన అధికారి త్రిశంకు స్వర్గంలాంటి మధ్యతరగతికి చెందినవారేగా అనుకున్నాడు చంద్రం.

"ధనవంతులు మనల్ని వంచిస్తున్నా"రంటారు మధ్యతరగతి జనం.

"ధనవంతులు మా నెత్తురు తాగేస్తున్నా" రంటారు బీదవాళ్లు.

"నిజంగా ఎవరు ఎవరిని వంచిస్తున్నారు? ఎవరు ఎవరి రక్తాన్ని తాగేస్తున్నారు?" అని ప్రశ్నించుకున్నాడు చంద్రం.

చంద్రం నడుస్తున్నాడు.

రిక్షాలు, కార్లు, సైకిళ్లు అతణ్ణి దూసుకుపోతున్నాయి. అతని బుర్రలో ఆలోచనలు పరుగులు తీస్తున్నాయి.

"హాల్లో...ఎక్కడికి? ఆలోచనలతో పరాగ్గా నడుస్తున్న చంద్రాన్ని ఎవరో పలకరించారు. చంద్రం ఆగిపోయాడు.

"కవి సమ్మేళనానికేనా?" ఆ వ్యక్తే మళ్ళీ ప్రశ్నించాడు. అవునన్నట్టు తలూపాడు చంద్రం.

"ఒకపారి మాఇంటికి రా బ్రదర్ ... మా తమ్ముడికి పరీక్షలొచ్చిపడ్డాయి. కొత్త నోట్సు చెప్పి పోదువుగాని" అన్నాడా వ్యక్తి.

"దానిదేముంది—వస్తాలే" అన్నాడు చంద్రం.

అతను రిక్షాను కేకవేశాడు. ఇద్దరు రిక్షావాళ్ళు పరుగెత్తి వచ్చారు. అతను తను పోవాల్సిన గమ్యం చెప్పాడు.

"పదణాలుసార్!"

"రూపాయక్కర్లా...ఇందాక అయిదణాలకే వచ్చాను."

"మూడు మైళ్ళండి, ఎవరొస్తారు సార్ — ఎనిమిదణాలివ్వండి"

"ఆరణాలివ్వండిసార్" రెండోరిక్షా వాడందుకొన్నాడు.

రిక్షావాళ్ళిద్దరూ తిట్టుకున్నారు. ఆ వ్యక్తి రెండో రిక్షాలో ఎక్కాడు.

ఆ వ్యక్తి రిక్షావాడి నెత్తురు తాగేస్తున్నట్టుగా బాధపడ్డాడు చంద్రం!

అతను వెళ్ళాల్సిన ప్రదేశానికి పదణాలు తక్కువే. మూడు మైళ్ళు. సగందూరం రిక్షాదిగి లాక్కుపోవాలి. మొదటి రిక్షావాడు న్యాయంగానే అడిగాడు. ఆ వ్యక్తి వాణ్ణి బుకాయించాడు. అంత వరకూ బేరం దొరకని రెండోరిక్షావాడు ఆరణాలకే సిద్ధమయ్యాడు.

"రిక్షావాడు రిక్షావాణ్ణి మోసగించాడు. వాళ్ళిద్దరినీ తన మిత్రుడు వంచించాడు" అనుకున్నాడు చంద్రం.

రిక్షావాళ్ళల్లో పోటీ మనస్తత్వం కలిగించి తను లాభపడ్డాడు త్రిశంకుస్వర్గపు మనిషి.

"తన మిత్రుడు ఎంత స్వార్థపరుడు!" అనుకున్నాడు చంద్రం.

చంద్రం నడుస్తున్నాడు.

విసుగూ విరామం లేకుండా పరుగెత్తుతున్నాయి మోటారు కార్లు, రిక్షాలు, సైకిళ్ళు అతణ్ణి దూసుకుపోతున్నాయి. అతని బుర్రలో ఆలోచనలు పరుగులు తీస్తున్నాయి.

"తమ్ముడికి నీతులు చెప్పడానికి రమ్మన్న పెద్దమనిషి, అంత దూరం ఎలా వస్తాననుకున్నాడు? తను రాలేనని కచ్చితంగా ఎందుకు చెప్పలేక పోయాడు?" అని ప్రశ్నించుకున్నాడు చంద్రం.

"తను అతనింటికి పోయిరావాలంటే జేబులో రూపాయి వుండాలి. జేబులో ఆ మాత్రం ఆదరువే వుంటే కవిసమ్మేళనానికి దర్జాగా రిక్షాలోనే వెళ్ళేవాణ్ణిగా......రేపు రావడానికని అతణ్ణి రూపాయి ఎందుకు అడగలేక పోయాడుతను?"

ముఖమాటం అడ్డు వచ్చింది.

రూపాయి అడిగితే చులకనైపోతాననుకున్నాడు.

"నీ వుత్త బూర్జువావి" ఒకప్పుడో మిత్రుడన్న మాట జ్ఞాపకం వచ్చింది చంద్రానికి.

"తను లేనివాడినని చెప్పుకోలేడు. ఉన్నవాడినని నటిస్తాడు. దీన్నే బూర్జువా తత్వమంటారు కాబోలు".

'మింగ మెతుకు లేదుకాని, మీసాలకు సంపంగి నూనె' అన్న నానుడికి రంగుపూసి బూర్జువాతత్వ మంటున్నా'రనుకున్నాడు చంద్రం.

నడుస్తున్న చంద్రం హఠాత్తుగా ఆగిపోయాడు — నోరు తెరుచుకొని, వెనక్కి తిరిగి కళ్ళప్పగించి చూస్తూ.

"రాఘవులూ" అని పిలిచాడు. అతని పిలుపు వినిపించిందో లేదో గాని చంద్రంవంక ఎవరూ తిరిగైనా చూడలేదు. చూసీ చూడనట్టూ, వినీవిననట్టూ వెళ్ళిపోయాడు రాఘవులు. రాఘవుల నిర్లక్ష్యానికి చంద్రానికి కోపంరాలేదు. "మానవజాతి రానురాను ఎంత అవిశ్వాసంగా తయారవుతున్నది" అని గొణుక్కున్నాడు.

కష్టసమయంలో రెండుమూడుసార్లు రాఘవుల్ని ఆదుకున్నాడు చంద్రం. తన పలుకుబడితో ఉద్యోగం ఇప్పించాడు. బ్రతకడం నేర్చుకున్న రాఘవులు ఉద్యోగంలో అంచలంచలుగా పైకి వెళ్ళిపోయి నాలుగురాళ్ళు కూడబెట్టాడు.

"రాఘవులకు తనతో ఇప్పుడు పనేముంది. తనెక్కడ సహాయ మడుగుతానని తప్పించుకుపోయాడు" అనుకున్నాడు చంద్రం.

ఏదో విచిత్రమైన గొంతు వినిపించేసరికి చంద్రం పక్కకు తిరిగి చూశాడు.

ఎవరో పిచ్చివాడు పేవుమెంటుమీద నిలబడ్డాడు. దట్టంగా పెరిగిన గడ్డం, వాలికలైన బట్టలు వికారంగా వున్నాడు. వాడిచుట్టూ కొందరు చేరి విడ్డూరంగా చూస్తున్నారు. పిచ్చివాడు ఒక్కసారి పగలబడినవ్వాడు.

కోతిలా ముఖంపెట్టి, 'కిచకిచ' మన్నాడు. నక్కలా కూత పెట్టాడు. కోకిలలా గానంచేశాడు. అంతలోనే రామచిలుకలా అరిచాడు.

జనం ఆశ్చర్యంగా చూస్తున్నారు. చంద్రం పెడగా నిలబడ్డాడు. పిచ్చివాడు రెండునిమిషాలు గాలిపీల్చుకొని, కుక్కలా అరిచాడు. గుర్రంలా సకిలించాడు. గాడిదలా ఓండ్రపెట్టాడు. సింహంలా గర్జించాడు.

"రేడియోవాళ్లు ఈ పిచ్చివాణ్ణి సౌండ్ ఆర్టిస్టుగా తీసుకుంటే ఎంత బాగుంటుం"దనుకున్నాడు చంద్రం.

రేడియోకి ఇటువంటి పిచ్చివాళ్ళు పనికిరారు. కళాకారుని ముద్ర పిచ్చివాడికి ఎలాపడుతుంది? ఆ ముద్రపడందే రేడియోవాళ్లు ఎలాగు తీస్తారు? తనే సమాధానం చెప్పుకున్నాడు.

పిచ్చివాడు జంతువుల అరపులుమానేసి ఉపన్యాసం మొదలు పెట్టాడు. ఖర్మంచాలక పిచ్చివాడయ్యాడుగాని ఒకపార్టీకి నాయకుడు కావాల్సింది. ఆ పిచ్చివాడి ఉపన్యాసంచుట్టూ చేరినవారందరినీ ఆకర్షించింది. అక్కడ చేరిన వారందరూ మధ్యతరగతివాళ్ళే! పిచ్చివాడిమాటల్ని యథాతథంగా వ్రాస్తే దేశద్రోహి నంటారు నన్ను. అయితే పిచ్చివాణ్ణి పోలీసు లెందుకు అరెస్టు చెయ్యలేదంటారు. అదంతా పిచ్చివాగుడు క్రింద జమకట్టి వుంటారు. లేదా పిచ్చివాడు జంతువుల అరపులమధ్య ఉపన్యాసం కొనసాగించి వాళ్ళను మోసగిస్తున్నాడేమో! అసలు పిచ్చివాడవునో కాదో! కాని చూసినవారు పిచ్చివాడని ఘంటాపథంగా చెప్పేట్టుగా వుంటాడు.

భద్రాచలం పడవప్రమాదాలు, గోదావరి వరదలు, తెలంగాణలో కరువు, రైలు ప్రమాదాలు, కాశ్మీరుసమస్య, ఆర్థికమంత్రి విదేశాలను అప్పుకోరడం - ఇవన్నీ పిచ్చివాడి ఉపన్యాసంలోని భాగాలు. ప్రణాళికలను విమర్శించాడు. ప్రభుత్వ విధానాన్ని ఖండించాడు. విప్లవాన్ని ఆహ్వానించాడు. ప్రభుత్వం మారాలన్నాడు. ఉపన్యాస మంతా సగం తెలుగులో సగం ఇంగ్లీషులో సాగింది. ఉన్నట్టుండి పిచ్చివాడు త్యాగరాజకీర్తన అందుకున్నాడు. అది పూర్తికాకుండానే "రోజులు మారాయి" పాట ప్రారంభించాడు.

"ఇతను పిచ్చివాడంటే ఎలానమ్మను? జీవిత పోరాటంలో ఓడిపోయి మనస్సు చెడగొట్టుకొని వుంటాడు." అనుకున్నాడు చంద్రం.

ఆకలి వేస్తున్నదని పిచ్చివాడు యాచన ప్రారంభించాడు. ఈ సంగతిని అంతకుముందే పసికట్టి కొందరు వెళ్ళిపోయారు.

"పిచ్చివాడికైనా ఆకలిదప్పులు తప్పవుగా. ఇంత వినోదం కలిగించాడు అందరూ తలో కాణీ యిస్తే ఇంతలోనే దరిద్రంవచ్చి పడుతుందను కున్నారేమో" అనుకుంటూ ఒక అణా పిచ్చివాడి చేతిలో వేసి చంద్రం బయలుదేరాడు.

చంద్రం నడుస్తున్నాడు.

ఇప్పుడతను నడుస్తున్న ప్రదేశం అంత జనసమ్మర్దమైంది కాదు. వెనకటిలా కార్లు ఎక్కువగా పరుగెత్తడం లేదు. రిక్షాలు, కార్లు దూసుకు పోవడం లేదు.

"ఎవరు ఎవరిని వంచిస్తున్నారు.? ఎవరు ఎవరి రక్తం తాగుతున్నారు?" అన్న ప్రశ్న తిరిగి జ్ఞాపకం వచ్చింది చంద్రానికి.

"నైతికంగా దిగజారిపోతున్న దెవరు?" మరో ప్రశ్న ఎదురైంది చంద్రానికి.

అతని బుర్రలో మళ్ళీ ఆలోచనలు చెలరేగాయి.

ప్రతివాడిలోనూ స్వార్థం పడగలెత్తింది. తనను తానే మోసగించు కుంటున్నాడు. తోటివాడిని వంచిస్తున్నాడు. శత్రువెక్కడో లేడు. తన శత్రువు తనలోనే వున్నాడు. మధ్యతరగతిప్రజ ఇంతగా దిగజారడానికి కారణం? ఔన్నత్యాన్ని ఎందుకు పొందలేక పోతున్నారు?

చంద్రం బుర్ర వేడెక్కి తలనొప్పి వచ్చింది.

ఎదురుగ్గా అయ్యంగారి హోటల్ ఆహ్వానించింది.

జేబులు తడుముకున్నాడు.

రెండు చిల్లికాన్లు బైటకివచ్చాయి.

చంద్రం నవ్వుకున్నాడు.

ఆరెండు చిల్లికాన్లతో పాన్‌కొని వేసుకొని బయలుదేరాడు.

"తానెందుకు పాన్ వేసుకున్నట్టు?" అని ప్రశ్నించుకున్నాడు.

"నలుగురూ తను హోటలుకు వెళ్ళివచ్చినట్టు భ్రమించాలని పానువేసుకోడం దేనికి? ... తను దరిద్రుడిగా ఎవరూ భావించకూడదని తనకుతానే వంచించుకుంటున్న తత్వంఎప్పుడు పోతుంది? అన్న ప్రశ్నకు వెంటనే సమాధానం చిక్కలేదు చంద్రానికి.

ప్రళయం రావాలి.

శివుడు నృత్యం చేయాలి.

భూమ్యాకాశాలు దద్దరిల్లాలి.

సముద్రాలు పొంగాలి.

గంగా గోదావరుల కట్టలుతెగాలి.

కృష్ణ వెల్లువలై పారాలి.

ఆప్రళయంలోంచి క్రొత్తమనిషి పుట్టుకురావాలి.

చంద్రానికి తల తిరుగుతున్నట్లయింది. పడిపోతానేమో నను కొని, బొటనవ్రేళ్లతో భూమిని అదిమిపట్టి నిలుచున్నాడు.

"ఏమిటి తనింత భయంకరంగా ఆలోచిస్తున్నాడు" అని ప్రశ్నించుకున్నాడు.

"నూతన సమాజ నిర్మాణానికి బాటలు వేసుకుంటున్నాము. దేశం సౌభాగ్యమయంగా వుంటానికి ప్రణాళికలు వేసుకుంటున్నాము. నీకు జాతిమీద విశ్వాసం లేకపోతే ఎట్లా?" అన్న భజన పరుడి మాటలు స్ఫురణకు వచ్చాయి చంద్రానికి.

"ఎన్ని కోట్లరూపాయలు కేటాయించి, ఎన్ని ప్రణాళికలు వేస్తే జాతిలో నీతి నిజాయితీలు పెరుగుతాయి? ప్రభుత్వం ఎన్ని సినిమాలు తీయిస్తే మానవత్వం మనిషిలో మేలుకుంటుంది? ఎంత మంది మేధావులు ఎన్ని పథకాలువేస్తే జాతిలో ఇన్ని తెగలు లేకుండా ఒక్క త్రాటిమీద నడవగలుగుతారు?"

"హల్లో...రండి...రండి..." అన్న మాటలతో చంద్రం ఆలోచనలు చెదిరిపోయాయి.

"ఈపాటికి సభ ప్రారంభమై వుంటుందనుకున్నాను" అన్నాడు చంద్రం.

"ఇంకో అరగంటలో అధ్యక్షులు వచ్చేస్తారండీ...వారు రాగానే ప్రారంభించడమే...రండి...లోపల కూర్చుందురుగాని" అన్నాడు కార్యకర్త.

చంద్రం లోపలికి వెళ్ళాడు. అప్పటికే అక్కడ కొందరు కవులు అధివసించి వున్నారు. 'ఒహో' అంటే 'ఓహో' అని ఒకరి నొకరు చిరునవ్వులతో పలుకరించుకున్నారు. ఆ పలుకరింపుల్లో ఆప్యాయత లేదు. ఆ చిరునవ్వులు సహజసిద్ధమైనవి కావనుకున్నాడు చంద్రం. చంద్రాన్ని చూసేప్పటికి ఒక కవికిశోరం లేచి వచ్చి ఆలింగనం చేసుకున్నాడు. "లోపల ఎంత కుళ్ళుపెట్టుకుని, పైకి ప్రేమ ఒలకబోస్తున్నా" డనుకున్నాడు.

చంద్రం ఓ ప్రక్కగా కూర్చున్నాడు.

రికార్డుల సంగీతం, చెవుల్ని హోరుచేస్తున్నది.

తానొక మహాకావ్యం వ్రాయబోతున్నట్టు—దానికి ఇండియా ఉపాధ్యక్షుడు పీఠిక వ్రాయడానికి ఒప్పుకున్నట్టూ చెబుతున్నాడు ఒక మహాకవి.

"ఈమధ్య వస్తున్నదంతా, ఆకలి కవిత్వం, ప్రేమకవిత్వం తప్ప ఆధ్యాత్మికత ఎక్కడా కనిపించడంలేదు కదా!" తలనెరసిన ఒక కవి శార్దూలం తన భక్తుడితో అంటున్నాడు.

"కవిత్వానికున్న పావిత్ర్యాన్ని చెడగొడుతున్నారు ఆధునికులు" ఒక విమర్శకుడు వాపోతున్నాడు.

"ఈ కవిసమ్మేళనానికి ఉంగరాల జుట్టాయన రాకపోతే జయం మనదే" అంటున్నాడు ఒక కవిసింహం బిరుదాంచితుడు.

ఆఁ...ఆ ఉంగరాలజుట్టు కవిలో కవిత్వమేముందండీ— వాబోంద. సంగీతంతో జనాన్ని మోసగిస్తున్నాడు. మీ ముందు ఏకవి నిలవగలడు? ఈనాటివిజయం మీదేనండి" అంటున్నాడు ప్రక్కవాడు.

వాళ్ళ అమాయకత్వానికీ, ఈర్ష్యాసూయలకూ నవ్వుకున్నాడు చంద్రం.

శిల్పంతా మేధావులు. జాతిని మేల్కొల్పే వైతాళికులు.

"ఏదిసత్యం?...ఏదసత్యం—ఓ మహాత్మా?" రికార్డు సంగీతం కర్ణపుటాల్లో గింగురుమంటున్నది.

ఎవరి కొఱకా వాలాపాట?

ఎవరి కొఱకా వాలా మీమాంస?

అక్కడ కూర్చున్నవారిలో సంచలనం కలిగింది. ఏమిటోనని తిరిగిచూశాడు చంద్రం. అధ్యక్షులు వస్తున్నారు. ఒక కార్యకర్త దారి చూపిస్తున్నాడు. ఇద్దరు కార్యకర్తలు భక్తిప్రపత్తులతో ప్రక్కన నడిచే అంగరక్షకుల్లా వస్తున్నారు.

అధ్యక్షుడు సామాన్యుడు కాడు.

దేశాన్ని ముందుకుతీసుకుపోతున్న మంత్రి పుంగవుడు.

మంత్రిగారి రాకతో సభాస్థలి జనంతో నిండిపోయింది. ఎన్నడూ కవి సమ్మేళనాలకురాని పత్రికా విలేఖరులూ ఫోటోగ్రాఫర్లు అక్కడ హాజరయ్యారు.

తెలుగు నుడికారం తెలియనివాడు కవి సమ్మేళనానికి అధ్యక్షుడు. రైతు జీవితాల్ని కొల్లగొట్టి ప్రభుత్వందగ్గర నష్ట పరిహారం తీసుకుంటున్న ఒక మాజీ సంస్థానాధిపతి సభా ప్రారంభకుడు.

సభంతా కలయచూశాడు చంద్రం.

సభలో కూర్చున్నవారంతా మధ్యతరగతి జనం. కవిత్వం చదవటానికి వచ్చినవారంతా ఆ తెగకు చెందినవారే!

ఎక్కడికైనా తయారయ్యేది ఈ త్రిశంకు స్వర్గవాసులే!

రికార్డులకు విశ్రాంతి కలిగింది. సభ ప్రారంభమైంది.

మంత్రిగారు సభకు వస్తుంటేనే ఒక ఛాయాగ్రాహకుడు క్లిక్ మనిపించాడు. ఆయన వేదికమీదికి ఎక్కుతూంటే మరో ఫోటోగ్రాఫర్ కళ్లు జిగేలుమనేట్టు బొమ్మ లాగేశాడు.

కార్యదర్శి నివేదిక చదవడం ప్రారంభించాడు.

కొంతమంది కవులు తాము చదవబోయేవాటికి తుది మెరుగులు పెడుతున్నారు.

చంద్రం జేబులోంచి కొన్ని కాగితాలు తీశాడు.

"ఎందుకు వ్రాశాడు తానీకవిత్వం?"

'తనను మోసం చేసుకోలేడు.'

'జనాన్ని వంచించలేడు.'

చంద్రం ఆ కాగితాలను చర్రున చించి ఉండలుండలు చేసి బల్లక్రిందికి విసిరాడు. ఒక తెలిసిన కార్యకర్త కనిపిస్తే పిలిచి తాను కవిత్వం చదవబోవడం లేదనీ, తన పేరును జాబితాలోంచి తీసేయించవలసిందనీ చెప్పాడు.

"మీరు చదవకపోతే ఎట్లా? మీ పేరుమీద కొంతమంది వచ్చారు. క్రొత్తది వ్రాయకపోతే పాతదే ఏదో ఒకటిచదివెయ్యండి" అన్నాడు కార్యకర్త.

"ఇంతమందిలో నిజంగా తన కవిత్వాన్ని అభిమానించేవాళ్లు ఎంతమంది? వాళ్లకు తను ఆశాభంగం కలిగిస్తున్నాడా?" అని ప్రశ్నించుకున్నాడు చంద్రం.

పాత కవిత్వం చదవటం ఇష్టంలేక క్రొత్తది వ్రాసు కొచ్చాడు. ఇప్పుడో క్రొత్త అనుభవం కలిగేప్పటికి ఆ కాగితాలు చించివేశాడు.

కార్యదర్శి నివేదిక చదవడం అయిపోయింది. మరో కార్యదర్శి సందేశాలు చదవడం ప్రారంభించాడు.

ఎవరి కొఱకీ నివేదికలు?

ఎవరి కొఱకీ సందేశాలు?

జనానికి కవిత్వం కావాలి.

కార్యకర్తలకు సందేశాలు కావాలి.

కార్యదర్శి నివేదిక లేందే, వారు జరుపుతున్న కార్యక్రమాలు జనానికి ముఖ్యంగా మంత్రిగారికీ, మాజీ సంస్థానాధిపతికీ ఎలా తెలియాలి. అది వారికి తెలపందే విరాళాలు పొందటం ఎట్లా?

ఇది ప్రచార యుగం.

సభలకు మంత్రులొస్తే ఎంతో ప్రచారం వస్తుంది.

సందేశాలవల్ల తమ గొప్పదనాన్ని చాటుకోవచ్చు.

ఆ సందేశాల్లో భారతాధ్యక్షుడి దగ్గిరనుంచి మ్యునిసిపల్ చైర్మన్ సందేశంవరకూ ఉన్నాయి.

అచ్చాఫీసువాళ్ళు ఒక పెళ్ళిపత్రికను కంపోజు చేయించి అవసరమైనప్పుడు తిథి వార నక్షత్రాలు పేర్లుమార్చి వెయ్యి పెళ్ళిళ్ళకు ఆ మేటరునే ఉపయోగించినట్టు, కవులు ఏ వధూవరులకైనా పనికి వచ్చే ఆశీర్వచన పద్యాలు వ్రాసిఉంచినట్లు సందేశాలు పంపే పెద్దలంతా ఒకే డ్రాఫ్టును ఎన్ని వేల సందేశాలకు ఉపయోగిస్తున్నారో అనుకున్నాడు చంద్రం.

సందేశాలు చదవడం అయిపోయింది.

కవు లందరినీ వేదికమీదికి ఆహ్వానించారు.

రాజఠీవిని ప్రదర్శిస్తూ ఒక్కొక్క కవే వేదికమీదికి వెళ్ళి, సహజంగా లోపలవున్న బానిసతత్వంవల్ల మంత్రిగారికి వినయంగా నమస్కరించి తమతమ స్థానాల్లో కూర్చుంటున్నారు.

చంద్రం కదల్లేదు.

"చంద్రంగారు కూడా దయచేసి వేదికమీదికి రావాలి" అని కార్యదర్శి మైకులో అరిచాడు.

"ఎంత సిగ్గుచేటు? తను బెట్టుచేస్తున్నట్టు అంతా అనుకుంటారేమో!" అనుకుంటూ చంద్రం వేదికమీదికి వెళ్ళాడు.

కవులంతా అదో తమాషాగా చూశారు చంద్రాన్ని.

మాజీ సంస్థానాధిపతి ప్రారంభోపన్యాసం ప్రారంభించాడు.

కవిత్వమంటే తనకెంతో ఇష్టం. తన సంస్థానంలో వెనక ప్రతి ఏడూ కవుల్ని సన్మానిస్తుండేవాడినని, ఇప్పుడు రాజులతోపాటు, మాలాంటి సంస్థానాధిపతులు, జాగీర్దార్లు తుడిచిపెట్టుకుపోయారు కాబట్టిన్నీ ప్రజలే ఇప్పుడు ప్రభువులు కాబట్టిన్నీ కవుల్ని వారే సన్మానించాలన్నాడు.

"ఎంతటి సత్యాన్ని వక్కాణించాడూ" అనుకున్నాడు చంద్రం.

"నేను కవినిగాను. రచయితనీగాను. ఈకవి సమ్మేళనానికి అధ్యక్షస్థానం వహించగల అర్హత నాకులేదు" అని ప్రారంభించారు మంత్రిగారు.

"అయితే తమరు వేదిక దిగవచ్చు" అంది ఓ పెళుసుగొంతు. జనం గొల్లుమంది. 'ఎవరిదాగొంతు' అనుకుంటూ చంద్రం జనంలోకి చూశాడు. పేవుమెంటుమీద కనిపించిన పిచ్చివాడు అక్కడ ప్రత్యక్షమూడం చంద్రానికి ఆశ్చర్యం కలిగించింది. కార్యకర్తలు పిచ్చివాణ్ణి బైటకిపొమ్మని నెడుతున్నారు.

"నేను పోను" అని మొరాయించి కుర్చీలో పీఠంవేసి కూర్చున్నాడు పిచ్చివాడు.

మంత్రిగారు ఇదేమీ తనకు పట్టనట్టే ఉపన్యాసం చేస్తున్నారు.

"కార్యకర్తల కోరికను చిన్నబుచ్చడం భావ్యంకాదని అధ్యక్షత వహించడానికి ఒప్పుకున్నాను. మీకందరికీ కవిత్వం విషాలని వుందని నాకు తెలుసు. మిమ్మల్ని విసిగించకుండా రెండుమాటలు చెప్పి ముగిస్తాను. కవులు నిరంకుశులు. ఫలానిది వ్రాయమని ఎవరూ వారిని ఆదేశించలేరు. ఆదేశించినా వారు వ్రాయరు. వారికుండే ఈతిబాధలు నాకు తెలుసు. బాధల్లోంచే ఉదాత్తమైన కవిత్వం పుట్టుకు వస్తుందని కొందరు పెద్దలన్నారు. దేశాన్ని ముందుకు తీసుకుపోయేది కవులు. మీరు వైతాళికులు. మీరంతా మన ప్రణాళిక దిగ్విజయానికి తోడ్పడాలి. అంటే మీరు ప్రణాళికోద్దేశాలు ప్రజల హృదయాలపై ముద్రవేసేట్టు కవిత్వాన్ని సాధనగా ఉపయోగించాలని మనవి చేస్తున్నాను." అంటూ కూర్చున్నారు మంత్రిగారు.

కవి సమ్మేళనం ప్రారంభమైంది.

ఒక కవి ఆంధ్రుల పూర్వాన్నత్యాన్ని కవిత్వంలో ప్రస్తుతించాడు.

ఒక కవి ప్రేయసి కాటుకకళ్ళను మద్దికుడున్నాడు.

ఒక కవిశేఖరుడు మైకు ముందరకు వచ్చాడు.

"ఇప్పటిదాకా ఆఫీసు పనితో అలసిపోయివచ్చాను. నిలబడటానికక్కడా ఓపిక లేదు. అయినా రెండుమూడు పద్యాలుచదివి విరమిస్తాను." అని చెబుతున్నాడు కవిశేఖరుడు.

"ఎందుకీ ఉపోద్ఘాతమంతా" అని వేదికమీద కూర్చున్న ఇద్దరు కవులు గుస గుస లాడుకున్నారు.

"క్రొత్తది వ్రాయడానికి తీరుబడి లేకపోయింది. నా రాగవల్లరి ఖండకావ్యంలోంచి కొన్ని పద్యాలు వినిపిస్తాను" అంటూ కవిశేఖరుడు ఒక పద్యం అందుకున్నాడు. మూడోపాదం జ్ఞాపకం రాకపోయేప్పటికి తల గోక్కుంటూ మొదటి రెండుపాదాలు పునశ్చరణ చేశాడు. అయినా లాభంలేకపోయింది. టేబులుమీద పెట్టుకున్న సంచీలోంచి ఆ ఖండకావ్యం తీసి రెండు నిమిషాలు పేజీలు తిరగవేసి పద్యం పూర్తిచేశాడు.

"ఆ ఏదుపు మొదలే ఏడవకూడదూ ?" అంది పెళుసుగొంతు.

మరోకవి కావ్యగానం ప్రారంభించాడు.

"........................

అతడు ఆమెనుచూచె
ఆమె యాతనిచూచె
ఇద్వురి చూపులలోన
ఏదో తియ్యనిబాధ
అతడు చెయిజాచె
ఆమె కేలందించె"

చిటికలు వేస్తూ తాళయుక్తంగా పాడుతున్నాడు.

ఒక పండితుడి వంతు వచ్చింది.

"అబ్బే—పూలహార మెందుకండీ"అంటూనే మెడవంచాడు.

"అధ్యక్షులకు సభాసదులకూ నమస్కారములు. ఈ కావ్యం రచించి దాదాపు పది సంవత్సరాలైంది. ఈమధ్యనే కొన్ని కాగితాలను చెదలు తినేసేప్పటికి ఆ పద్యాలను మళ్ళీ పూరించేప్పటికి తల ప్రాణం తోకకువచ్చినంతపనైంది. సహృదయులు వీటిని చిత్తగించాలి" అంటూ పళ్యం దటించి కావ్యగానం ప్రారంభించాడు. ఎక్కడ ఆపమంటారోనన్న భయంతో చకచకా పది పద్యాలు చదివేశాడు. సభికులు చప్పట్లు కొడుతున్నారు. "ఇక చాలించండి మహాప్రభో" అని ఒకసభికుడు పాలికేక పెట్టాడు. పండితుడు బిత్తరపోయి అధ్యక్షులవంక చూశాడు, కూర్చోమన్నట్లు సంజ్ఞ చేశాడు. "సర్లెండి—ఈ ఒక్క పద్యం చదివి ముగిస్తాను. ఇదంటే నాకెంతో అభిమానం" అంటూనే పద్యం చదివేసి, రెండు పుస్తకం చంకన పెట్టుకొని "ఈసారెప్పుడైనా అవకాశమిస్తే మంచి రమణీయఘట్టం చదివి వినిపిస్తాలెండి" అంటూ వెనక్కి తిరిగాడు.

"పాపం—అమాయకుడు" అనుకున్నాడు చంద్రం.

ఒక మహాకవి లేచాడు. అతని అభిమానులు చప్పట్లుకొట్టారు. చిరునవ్వుతో ఆ మహాకవి ఠీవిగా మైకుముందు నిలబడి ప్రక్కకు చూశాడు. పూలహారానికి ఆలస్యమైందేమో అని. ఆ కాస్తమెంక్కబడే ఆయాసక మహాకవి గళమెత్తాడు.

అది కావ్యగానంకాదు.

"హరికథా కాలక్షేపంలా వుం"దనుకున్నాడు చంద్రం.

ఆ మహాకవి భక్తబృందం తలలూపింది. చప్పట్లు కొట్టింది. మహాకవి పొంగిపోయాడు.

చివరకు చంద్రం వంతు వచ్చింది.

వేదికమీద కూర్చున్న కవులందరి కళ్ళూ అతనిమీద పడ్డాయి. సభలో నిశ్శబ్దత తాండవించింది.

చంద్రం ఏ కవి సమ్మేళనంలోనూ కాగితాలు చూడకుండా చదవలేదు. పైకి ముందుకు వెళ్లాక ఏ జేబులోంచైనా కాగితాలు బైటికి తీస్తాడనుకున్నారు కవులు. వాళ్లకు ఆశ్చర్యం కలిగించాడు చంద్రం.

చంద్రం ఒక్కసారి సభంతా కలియచూశాడు.
అతని చర్య క్రొత్తగా అనిపించింది కవులకు.
"ఎన్నాళ్ళీ గాఢ పరిరంభణం
ఎందుకీ ప్రళయకేళీ విజృంభణం!
నన్ను విడిచిపుచ్చు మత్తకాశినీ
నను నీ అనురాగపు హాలాహలం త్రాగించకు విలాసినీ!"

మహాకవి చెవులు రిక్కపొడుచుకున్నాయి. ఏమిటీ ధోరణి అనుకుంటూ కొందరు కవులు తెల్లముఖం వేశారు. అధ్యక్ష స్థానంలో కూర్చున్న మంత్రికి అయోమయం అనిపించిందేమో నోరు తెరచి చూస్తున్నాడు. తనకెక్కడ అర్థం కాలేదను కుంటారోననేమో మాజీ సంస్థాధిపతి "ఓహోహో!" అన్నాడు.

"ఎన్నాళ్ళీ గాఢ పరిరంభణం
ఎందుకీ ప్రళయకేళీ విజృంభణం!
నన్ను విడిచి పుచ్చు మత్తకాశినీ
నను నీ అనురాగపు హాలాహలం త్రాగించకు విలాసినీ!
ఓ మందారపు సౌందర్యం చిలికే
అరుణాధర చుంబనం
మధురానుభూతి చేకూర్చిందనుకోకు
ఇది లిప్‌స్టిక్ పైపూతల మెరుగు
ఇది ప్లాస్టిక్ అనురాగపు బిగువు
దుష్టవిధి దోసిళ్లతో బూడిద నెత్తిన రాత్రి
కాలుష్యపు నల్లరంగు గట్టిగా పులుముకున్న కొప్పులో
హృదయ కుసుమాన్ని తురిమి
నీ సౌందర్యం నిత్య సత్యమేనని
నీ గుండెలలోని విషభాండం
నిర్మలమైన ప్రేమామృత సంభరితమేనని
లోకం ముందు నా పతి నగ్న స్వరూపం
బయటపెట్టలేని బలహీనతలో
ఎన్నాళ్ళీ ఆత్మవంచన
ఎందుకీ ప్రళయకేళీ విజృంభణ!"

సభలో చప్పట్లు చెలరేగాయి. మహాకవి అద్భుతంగా వుందని కరస్పర్శ చేశాడు. అంతటి మహాకవి అద్భుతంగా వుందన్నప్పుడు ఎవరికీ సంశయం కలుగలేదు. అధ్యక్షుడు చాలా బాగుందని మెచ్చుకున్నాడు. "ఈనాటి విజయం తమదే" అన్నాడు ఒక అభ్యుదయకవి. ఇంతలో సభలో కోలాహలం బయలుదేరింది. వేదిక మీద వారు ఏమిటా అని చూశారు. పిచ్చివాడు జనాన్ని నెట్టుకొని వేదిక దగ్గరకు వస్తున్నాడు. కార్యకర్తలు అతణ్ణి అడ్డుకున్నారు.

"రాజుకంటే బలవంతుడు మొండివాడు" అన్న నానుడిని రుజువు చేశాడు పిచ్చివాడు. అందరినీ విదిలించుకొని వేదిక మీదకు దూకి "అధ్యక్షా, మహాజనులారా! నేను కవిత్వం చదవడానికి రాలేదు. ఎవరిమీదా కుస్తీకి రాలేదు. నేను చంద్రం అనే కవిని సన్మానించదలచుకున్నాను. నాకు అతని కవిత్వం నచ్చింది. అర్థంచేసుకుంటే అందరికీ నచ్చుతుంది. మీరు ఆయన్ని పూలహారం వేసి సన్మానించారు. నాకా శక్తిలేదు. చంద్రునికో నూలిపోగులా నా దగ్గరవున్న ఈ నాలుగు నయాపైసలతో చంద్రంగారికి సన్మానం జరుపుతున్నాను" అంటూ పిచ్చివాడు చంద్రాన్ని లేవదీసుకువచ్చి ఆ నాలుగు కాసులు చేతిలో పెట్టి చేతులుజోడించి, చరచరా వేదిక దిగి జనంలో కలిసిపోయాడు.

ఈ సంఘటన అందరినీ ఆశ్చర్యపరిచింది.
అందరూ తలోవిధంగా వ్యాఖ్యానించుకున్నారు.
కార్యదర్శి వందన సమర్పణంతో సభ ముగిసింది.
చంద్రం కళ్ళు పిచ్చివాడికోసం వెతికాయి.
ఎటుపోయాడో పిచ్చివాడు కనిపించలేదు.
చంద్రం నడుస్తున్నాడు.
చంద్రానికి అప్పుడు జ్ఞాపకంవచ్చింది ఇంటిసంగతి.

"రాత్రికి బొగ్గులు లేవు. తొందరగా ఇంటికిరండి. ఏకంగా వచ్చేప్పుడు పసిదానికి పాలడబ్బా కొనుక్కురండి" అని ప్రొద్దున ఆఫీసుకు వెళ్లేప్పుడు భార్యామణి శాసించింది.

"ఏమిటి చెయ్యడం? డబ్బెక్కడా పుట్టలేదు" అనుకున్నాడు.

"అయినా తను ఎంతమందిని డబ్బడిగాడు? ఒక్కణ్ణి. అతను లేదన్నాడు. మరెవరినీ తాను అడగలేకపోయాడు. తనైనా ఎక్కడైనా చూడాలి" అనుకున్నాడు.

చంద్రం నడుస్తున్నాడు.

సిమెంటురోడ్డు ప్రశాంతంగా వుంది. ఆకాశం నిర్మలంగా వున్నట్లనిపించింది. ఇరుప్రక్కలా వున్న భవనాలు చలనంలేని కొండల్లా వున్నాయనుకున్నాడు. ఎప్పుడోగాని కార్లు రావడం లేదు. ఎక్కడోగాని రిక్షా కనిపించడం లేదు.

గుమాస్తాలు నిర్భయంగా పడుకొని వుంటారు.

కాబూలీవాలా ఇనప్పెట్టె తెరచి నోట్లు లెక్కపెడుతుంటాడు.

కుంటటం అలవాటు చేసుకున్న బిచ్చగాడు మత్తుగా తాగి ఎక్కడో పడివుంటాడు.

బొజ్జమనిషి ఏ సినిమాహాల్లోనో స్నేహితులతో సోఫాలో కూర్చుని వినోదిస్తుంటాడు.

విద్యుశ్శక్తి ఏ రిక్షావాడి హస్తాల్లోనో నలిగిపోతూ వుంటుంది.

కత్తెర దొంగ ఎక్కడో జల్సాచేస్తుంటాడు.

కాలేజీ పడుచు ప్రశాంతంగా పాఠాలు వల్లిస్తూ వుంటుంది.

దారినపోయిన దానయ్యలు తాను చూచిన ఏ సుందరినో తలచుకొని భార్యను రంజింప చేస్తుంటాడు.

చంద్రం నడుస్తున్నాడు.
అతనిలో ఇప్పుడే ఆలోచనలూ లేవు.
అతనిలో ఒక్కటే తృప్తి.
అంతర్ముఖుడై తన జీవితపు నగ్న సౌందర్యాన్ని దర్శించాడు.
రసిక హృదయం ఫలకంమీద రూపించాడు.

—o—